రూ.60 కోట్లతో పనులకు శ్రీకారం


సమావేశంలో పాల్గొన్న కలెక్టరు శ్యామ్‌ప్రసాద్, అధికారులు

పార్వతీపురం, న్యూస్‌టుడే: పంచాయతీ రాజ్ శాఖ ఆధ్వర్యంలో రాష్ట్రంలో ఈనెల 14 నుంచి 'పల్లె పండగ" కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కలెక్టరు శ్యామ్‌ప్రసాద్ పేర్కొన్నారు. సంబంధిత విధి విధానాలను ఉప ముఖ్యమంత్రి, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి కె.పవన్‌కల్యాణ్ మంగళవారం కలెక్టర్లకు వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో రూ.60 కోట్లతో 313 పనులు సిద్ధం చేసినట్లు చెప్పారు. అన్ని గ్రామాల ప్రజా ప్రతినిధులతో చర్చించి ఈ నెల 14న శంకుస్థాపన పనులు చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. వివరాలు ప్రజలకు తెలిసేలా ప్రదర్శిస్తామన్నారు. ఇప్పటికే 95 శాతం పనులకు ఆమోదాలు వచ్చాయన్నారు. బీటీ రహదారులకు రూ.51 కోట్లు వెచ్చిస్తున్నట్లు పేర్కొన్నారు. జనవరి నెలాఖరు లోపు రహదారులు పూర్తి చేస్తామన్నారు. డ్వామా పీడీ రామచంద్రరావు, పార్వతీపురం, సీతంపేట గిరిజన సంక్షేమ, ఆర్అండ్‌బీ, పంచాయతీరాజ్ శాఖల ఈఈలు కుమార్, సింహాచలం, ప్రభాకరరావు, రవి, తవిటిరాజు పాల్గొన్నారు.

రాయితీపై టమాటా

పార్వతీపురం పట్టణం, న్యూస్‌టుడే: జిల్లా కేంద్రంలోని రైతు బజారులో రాయితీ టమాటా పంపిణీ ప్రక్రియ ప్రారంభమైంది. మంగళవారం ఎస్టేట్ అధికారిణి సంధ్యన విక్రయ కేంద్రాన్ని ప్రారంభించారు. కొన్ని రోజులుగా బయట మార్కెట్‌లో టమాటా ధర ఎక్కువగా పలుకుతోంది. రైతు బజారులో రూ.60 ఉండగా.. బయట రూ.80 వరకు అమ్ముతున్నారు. స్థానికంగా పంట అందుబాటులో లేకపోవడం, దూర ప్రాంతాల నుంచి దిగుమతులు తగ్గడం, ఇటీవల కురిసిన వర్షాలకు అక్కడ పంట దెబ్బతినడంతో ఈ పరిస్థితి ఏర్పడింది. ఈ నేపథ్యంలో చర్యలు చేపట్టినట్లు జేసీ శోభిక, మార్కెటింగ్ శాఖ అధికారులు తెలిపారు.

ప్రజా రవాణాకు పెద్దపీట


సమస్యలు తెలుసుకుంటున్న డీఎం దుర్గ

కలెక్టరేట్ ప్రాంగణం, న్యూస్‌టుడే: ప్రజా రవాణా వ్యవస్థలో ప్రయాణికులకు ఇబ్బందులు తలెత్తకుండా సమస్యలు పరిష్కరిస్తామని పార్వతీపురం ఆర్టీసీ సముదాయం ప్రబంధకురాలు ఈఎస్‌కే.దుర్గ పేర్కొన్నారు. మంగళవారం 'డయల్ యువర్ డీఎం' కార్యక్రమం నిర్వహించారు. పది మంది ఫోన్ చేసి సమస్యలు తెలియజేశారు. సీఐ కె.సుమిత్ర పాల్గొన్నారు.

◆ పార్వతీపురం డిపో నుంచి మధ్యాహ్నం 2 గంటలకు విశాఖ వెళ్తున్న, రాత్రి వేళల్లో వస్తున్న అన్ని బస్సులు పాత బస్టాండుకు చేరేలా చూడాలి. **- శ్రీహరి, పార్వతీపురం**

◆ పార్వతీపురం ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద ఇన్, అవుట్ గేట్ల వద్ద వీధి దీపాలు సరిగా వెలగక ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. **- సత్యనారాయణ, పార్వతీపురం**

◆ తాడికొండకు మధ్యాహ్నం వేళ ఒక సర్వీసు వేస్తే గిరిజనులకు సౌకర్యంగా ఉంటుంది. **- త్రినాథ, తాడికొండ**

◆ గౌరీపురంలో ఈ నెల 18, 19, 20న ఉత్సవాలు ఉన్నాయి. పెద్ద ఎత్తున భక్తులు వస్తారు. పెదబుడ్డిడి వరకు నైట్ హాల్ట్ బస్సులు నడపాలి. **- భాస్కరరావు, రావివలస**

◆ పార్వతీపురం నుంచి సంగంవలస మీదగా వెలగవలసకు బస్సు సౌకర్యం లేక విద్యార్థులు, ఉద్యోగులు ప్రైవేటు వాహనాలను ఆశ్రయిస్తున్నారు. ఈ దారిలో సర్వీసులు నడపాలని అయిదుగురు, కార్తికంలో పంచశైవ కేంద్రాలకు సర్వీసులు వేయాలని మరికొందరు కోరారు.

పాత బస్టాండుకు విశాఖ బస్సులు..

విశాఖ బస్సులు పాత బస్టాండుకు వెళ్లేలా చర్యలు తీసుకుంటాం. వెలగవలస మార్గం పరిశీలించి సర్వీసు నిర్వహణకు ప్రతిపాదిస్తాం. అజ్జాడ నైట్ హాల్ట్ బస్సుపై చర్చిస్తాం. కాంప్లెక్స్ ఇన్, అవుట్ గేట్ల వద్ద విద్యుత్తు దీపాలు పూర్తిస్థాయిలో ఏర్పాటు చేస్తాం. **- దుర్గ, ఆర్టీసీ డీఎం, పార్వతీపురం**

సర్వదర్శనే ప్రాప్తిరస్తు



ముఖాముఖి

'న్యూస్‌టుడే'తో పైడితల్లి దేవస్థానం ఈవో

– న్యూస్‌టుడే, విజయనగరం కంటోన్మెంట్

ఉత్తరాంధ్రుల ఇలవేల్పు పైడితల్లి ఉత్సవాలకు ఏర్పాట్లు జోరుగా సాగుతున్నాయి. ఇప్పటికే ప్రత్యేకాధికారిగా సింహాచలం దేవస్థానం కార్యనిర్వహణాధికారి వి.త్రినాథరావును నియమించారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా దేవస్థానం అధికారులు పూర్తిస్థాయిలో సౌకర్యాలు కల్పిస్తున్నారు. ఈ ఏడాది రూ.50 లక్షల వరకు ఖర్చు చేయనున్నామని ఆలయ సహాయ కమిషనర్ డీవీవీ.ప్రసాదరావు తెలిపారు. ఈ ఏడాది అందరికీ రుసుము లేకుండా సర్వదర్శనం కల్పించనున్నామని, వృద్ధులు, దివ్యాంగులకు ప్రత్యేక దర్శనానికి అవకాశమిస్తామని చెప్పారు. వివిధ అంశాలపై మంగళవారం 'న్యూస్‌టుడే'తో మాట్లాడారు.

3 గంటలకు ప్రారంభం..

ఈనెల 15న సిరిమానోత్సవం జరగనుంది. మధ్యాహ్నం 3 గంటలకు ఊరేగింపు ప్రారంభమవుతుంది. హుకుంపేటలో ఉదయం 11.30 గంటలకే బయలుదేరి ఒంటి గంట కల్లా ఆలయానికి చేరుకునే విధంగా చర్యలు తీసుకుంటాం. అనంతరం ఉత్సవం ఉంటుంది. సాయంత్రం 5.30కు పూర్తయ్యేలా చూస్తాం. ఆ బాధ్యతలు ఆర్డీవో చూడనున్నారు.

14 శాఖల పర్యవేక్షణ..

ఉత్సవాల్లో 14 శాఖలవారు భాగస్వామ్యం కానున్నారు. మా శాఖ అధికారులు, సిబ్బందితో పాటు రెవెన్యూ, పోలీసు, నగరపాలిక విభాగాలవారు కీలకం. సిరిమాను తయారీ, బయలు దేరడం, పూజారి కూర్చోవడం తదితర బాధ్యతలను అటవీశాఖ చూస్తోంది. భక్తులకు మజ్జిగ, బిస్కెట్లు అందిస్తాం. నగరపాలిక తాగునీరు ఇస్తుంది. పలు ప్రాంతాల్లో బయో మరుగుదొడ్లు ఉంటాయి. ఆలయ పరిసరాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు కానున్నాయి. అన్నిచోట్లా సీసీ కెమెరాల నిఘా పెట్టాం.



అందుబాటులో ప్రసాదాలు..

దర్శనాల అనంతరం లడ్డూ, పులిహోరా ప్రసాదాలు ఇవ్వనున్నాం. తొలేళ్లు, సిరిమాను రోజు నాటికి 50 వేల లడ్డూలు(80 గ్రాములు- రూ.15), 50 వేల పులిహోరా ప్యాకెట్లు(రూ.10) సిద్ధం చేయనున్నాం. ప్రస్తుతం ఏరోజుకారోజు అందిస్తున్నాం. పండగ రెండు రోజుల్లో స్వచ్ఛంద సంస్థలు ఉచితంగా చక్కెర పొంగలి, దద్దోజనం పంపిణీ చేయనున్నాయి.

అదనపు సిబ్బంది..

రద్దీ దృష్ట్యా 14, 15వ తేదీల్లో విశాఖ, శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల నుంచి 100 నుంచి 150 మంది వరకు దేవాదాయశాఖ సిబ్బంది అదనంగా విధుల్లో పాల్గొంటారు. పలు ఆధ్యాత్మిక భక్త మండళ్లు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు సైతం సేవలు అందించనున్నారు.

ఉప్పొంగిన భక్తిభావం

సిరిమానోత్సవ ముందు మంగళవారం సందర్భంగా విజయనగరంలోని పైడితల్లి చదురుగుడి, వనంగుడిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం 5 గంటల నుంచే దర్శనాలకు భక్తులు బారులుదీరారు. వివిధ ప్రాంతాల నుంచి తరలి వచ్చి.. మొక్కులు చెల్లించారు. నగరానికి చెందిన మహిళలు ఘటాలు సమర్పించారు. ఈ సందర్భంగా అమ్మవార్లు వస్త్ర, పుష్ప, స్వర్ణాభరణాలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు.

పకడ్బందీగా సిరిమానోత్సవ ఏర్పాట్లు

భక్తులకు మెరుగైన సౌకర్యాలు: కొండపల్లి

విజయనగరం రింగురోడ్డు, న్యూస్‌టుడే: జిల్లా ఖ్యాతిని ఇనుమడింపజేసేలా విజయనగరం ఉత్సవాలు, పైడితల్లి పండగను నిర్వహించనున్నట్లు మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. ఎమ్మెల్యే అదితి గజపతిరాజుతో కలిసి మంగళవారం ఉత్సవ వేదికలను పరిశీలించారు. నూతనంగా నిర్మించిన మల్టీ పర్పస్ ఇండోర్ స్టేడియాన్ని ప్రారంభానికి సిద్ధం చేయాలని ఆదేశించారు. ట్రాక్‌లు, కోర్టులను చూశారు. అనంతరం కోట సుందరీకరణ ప్రక్రియను తనిఖీ చేశారు. మాన్సాస్ మైదానంలో డ్వాక్రా ఎగ్జిబిషన్ ఏర్పాట్లపై ఆరా తీశారు. సంబంధిత గోడప్రతులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఉత్సవాల నేపథ్యంలో విజ్జీలో ఉత్తరాంధ్ర స్థాయి క్రీడా పోటీలు నిర్వహిస్తామని చెప్పారు. అంతర్జాతీయ ప్రమాణాలతో విజ్జీ మైదానాన్ని తీర్చిదిద్దనున్నట్లు ఎమ్మెల్యే అదితి పేర్కొన్నారు. ఈపీడీసీఎల్ ఎస్ఈ లక్ష్మణరావు, డీఆర్డీఏ పీడీ కల్యాణ్ చక్రవర్తి, ఏపీడీ సావిత్రి, డీఎస్‌డీవో వెంకటేశ్వరరావు, నగరపాలిక కమిషనర్ నల్లనయ్య తదితరులు పాల్గొన్నారు.


పనులు పరిశీలిస్తున్న మంత్రి శ్రీనివాస్, ఎమ్మెల్యే అదితి తదితరులు

అన్నదాతకు.. విశిష్ట గుర్తింపు



పార్వతీపురం పట్టణం, విజయనగరం వ్యవసాయ విభాగం, న్యూస్‌టుడే: రైతుల సంక్షేమంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నాయి. గతంలో అవగాహన లోపంతో కొందరు పథకాలు పొందలేని పరిస్థితి ఉండేది. ఇకపై ఈ సమస్య లేకుండా అన్నదాతలందరికీ గుర్తింపు సంఖ్యలు ఇచ్చేందుకు కేంద్రం సిద్ధమవుతోంది. వ్యవసాయ శాఖ వెబ్‌సైట్‌లోకి లాగిన్ అయ్యి సంఖ్యపై ఒక్క క్లిక్ చేస్తే పూర్తి వివరాలు ప్రత్యక్షమయ్యేలా ప్రణాళిక రూపొందిస్తున్నారు.

ఉమ్మడి జిల్లాలో ఇలా..

దేశ వ్యాప్తంగా వచ్చే ఏడాది మార్చి నాటికి 5 కోట్ల మందికి గుర్తింపు సంఖ్యలు జారీ చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఉమ్మడి జిల్లా పరిధిలో 6.68 లక్షల ఎకరాల సాగు భూమి ఉంది. 4.11 లక్షల మంది రైతులున్నారు. వీరిలో 31,069 మంది కౌలుదారులున్నారు. వీరందరికీ విశిష్ట గుర్తింపు సంఖ్యలు రానున్నాయి. పంటలను సులభంగా విక్రయించేలా, కనీస మద్దతు ధర పొందేందుకు ఈ ప్రక్రియ ఉపయోగపడనుంది. దేశంలో ఎక్కడి నుంచైనా రుణ అర్హత, బకాయిల వివరాలు, ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు.. తదితర వివరాలను తెలుసుకోవచ్చని వ్యవసాయాధికారులు రాబర్ట్‌పాల్, వీటీ.రామారావు తెలిపారు. మార్గదర్శకాలు వస్తే తదుపరి చర్యలు తీసుకుంటామన్నారు.

ఫలకికలు పడిపోతున్నాయ్


పార్వతీపురంలోని జిల్లా ఆసుపత్రిలో జ్వర బాధితులు

పార్వతీపురం పట్టణం, గుమ్మలక్ష్మీపురం, న్యూస్‌టుడే: మన్యంలో జ్వర పీడితులు పెరుగుతున్నారు. జిల్లా వ్యాప్తంగా 79 ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులున్నాయి. రోజుకు 3 వేలకు పైగా ఓపీ నమోదవుతోంది. సుమారు 1000 మంది వరకు జ్వరం, జలుబు, దగ్గు వంటి రుగ్మతలతో వస్తుండగా చాలా మంది మలేరియా, డెంగీ, ఇతర జ్వరాల బారిన పడుతున్నారు. దీంతో కొందరిలో ప్లేట్‌లెట్లు(రక్తఫలకికలు) తగ్గిపోతున్నాయి. డెంగీ బాధితులపై ఈ ప్రభావం మరింత ఎక్కువ. ఇటీవల రక్తఫలకికలు తగ్గిపోవడంతో ఇద్దరు వసతి గృహ విద్యార్థులు మృతి చెందడం గమనార్హం. గతంలో ఒకటి, రెండు కేసులు వస్తే స్థానికంగానే వైద్యం అందించేవారు. ప్రస్తుతం 20 వేల కంటే తక్కువకు పడిపోతుండటంతో విజయనగరం, విశాఖ తదితర ప్రాంతాలకు తరలిస్తున్నారు.

మన్యంలోని మారుమూల కొండల్లో ఏం జరుగుతుందో తెలియని పరిస్థితి. రక్త ఫలకికలు (ప్లేట్‌లెట్స్) తగ్గి రోగులు ఆసుపత్రులకు వరుస కడుతున్నారు. కేవలం నెల రోజుల్లోనే జిల్లా ఆసుపత్రిలో 15 కేసులు నమోదు కావడంతో వైద్యులు సైతం ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వీరంతా గిరిజనులే.

జిల్లాలో వరుసగా నమోదవుతున్న కేసులు

గిరిజనులే బాధితులు

ఏడో తరగతి చదువుతున్న ఈ విద్యార్థి పేరు సిద్ధు. నాలుగు రోజులుగా జ్వరంతో బాధపడుతున్నాడు. పచ్చ కామెర్ల బారిన పడ్డాడు. రక్తంలో హెచ్‌బీ 8 గ్రాము ఉంది. ప్లేట్‌లెట్లు 41 వేలకు పడిపోయాయి. ప్రాణాపాయ స్థితిలో ఉన్న విద్యార్థిని విశాఖ తరలించారు.



కొన్ని ఘటనలు ఇలా..

◆ గుమ్మలక్ష్మీపురం మండలం పి.ఆమిటి గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో 8వ తరగతి విద్యార్థిని అవంతి ఇటీవల మృతి చెందింది. ఈమెకు గత నెలలో ప్లేట్‌లెట్లు తగ్గడంతో విజయనగరం తరలించారు. కోలుకున్నాక ఇంటికి వచ్చిన కొన్నిరోజులకే మరోసారి జ్వరం బారిన పడింది. జిల్లా ఆసుపత్రిలో రక్తం ఎక్కించినా ఫలితం లేకుండా పోయింది. ◆ గత నెల 14న గుమ్మలక్ష్మీపురం మండలం కూరసింగికి చెందిన గర్భిణి బి.సుభాని జిల్లా ఆసుపత్రిలో చేరారు. ప్లేట్‌లెట్లు 16 వేలకు పడిపోవడంతో హుటాహుటిన విశాఖ తరలించారు.

◆ పార్వతీపురం మండలం కొత్తూరుకు చెందిన గర్భిణి గత నెలలో జ్వరంతో ఆసుపత్రిలో చేరారు. ప్లేట్‌లెట్లు 52 వేలకు పడిపోయినట్లు గుర్తించిన వైద్యులు కేజీహెచ్‌కు తరలించారు.

క్షేత్రస్థాయిలో అధ్వానం

గిరిజన ప్రాంతాల్లో క్షేత్రస్థాయిలో పరిసరాలు అధ్వానంగా ఉన్నట్లు తెలుస్తోంది. దీంతో మలేరియా, డెంగీ దోమలు వ్యాప్తి చెందుతున్నాయి. నివాసాల మధ్య తుప్పలు ఉండటంతో దోమ వృద్ధి చెందుతోంది. ఖాళీ పాత్రల్లో నీటి నిల్వలు, మూతలు లేకపోవడం, డ్రైడే సక్రమంగా పాటించడం లేదు. పారిశుద్ధ్య పనులు అంతంతగానే ఉండటంతో గిరిజనులు డెంగీ, మలేరియా బారిన పడుతున్నట్లు వైద్యులు భావిస్తున్నారు.

అప్రమత్తంగా ఉన్నాం..: జిల్లా ఆసుపత్రికి ప్లేట్‌లెట్లు తగ్గుతున్న కేసులు వస్తున్నాయి. గిరిజన గర్భిణులు, చిన్నారుల్లో ఈ పరిస్థితి ఉంది. సాధ్యమైన మేర స్థానికంగా వైద్యం అందిస్తున్నాం. 20 వేల కంటే తక్కువకు పడిపోతే విశాఖ, విజయనగరం తరలిస్తున్నాం. శాఖ పరంగా అప్రమత్తంగా ఉన్నామన్నారు. **- వాగ్దేవి, సూపరింటెండెంట్**

సాగునీటి సంఘాల ఎన్నికలకు వేళాయె!!

పార్వతీపురం, న్యూస్‌టుడే: గత ప్రభుత్వ పాలనలో సాగునీటి సంఘాల ఉనికి లేకుండా పోయింది. అయిదేళ్లలో ఎన్నికలు నిర్వహించకపోవడంతో జలవనరుల ప్రాజెక్టుల నిర్వహణ నీరుగారిపోయింది. నీటి పన్నుల వసూళ్లు, కాలువల మరమ్మతులు, జలాల పంపిణీ.. తదితరాలన్నీ నిలిచిపోయాయి. ఈక్రమంలో కూటమి ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టిసారించింది. ఈ నెల 16న సాగునీటి సంఘాలకు ఎన్నికల ప్రకటన విడుదల చేయనున్నట్లు ప్రకటించింది. ఈ ప్రక్రియను 40 రోజుల్లో పూర్తి చేయాలని ఆదేశించింది.

2015 నాటి జాబితా ప్రకారం

100 ఎకరాలకు పైగా ఆయకట్టు ఉన్న ప్రతి చిన్న నీటి పథకానికి, మధ్య తరహా, భారీ ప్రాజెక్టులకు కాలువలు, డిస్ట్రిబ్యూటరీల ప్రాతిపదికన సంఘాలను ఏర్పాటు చేస్తారు. 2015లో ఎన్నికల నిర్వహణకు వినియోగించిన జాబితానే ప్రాతిపదికగా తీసుకోవాలని భావిస్తున్నారు. దీనిలో కొన్ని మార్పులు చేయనున్నారు. జిల్లా జలవనరుల శాఖ పరిధిలో 583 చిన్న తరహా వనరుల కింద సంఘాలు ఏర్పాటు చేయాల్సి ఉంది. వెంగళరాయ, పెద్దగెడ్డ, ఒట్టిగెడ్డ జలాశయాలు, పెదంకలాం, పారాది ఆనకట్టలు, మధ్య తరహా ప్రాజెక్టుల కింద 75 ఆయకట్టుదారుల సంఘాలు, 5 ప్రాజెక్టు సంఘాలు ఏర్పాటు కావాలి. జంఝావతి, తోటపల్లి జలాశయాలు పూర్తికాని ప్రాజెక్టుల జాబితాలో ఉండటంతో వాటి పరిధిలో ఎన్నికలు ఉండవు.


మధ్య తరహా ప్రాజెక్టుల సంఘాలు.. (పార్వతీపురం డివిజన్)

ప్రాజెక్టు	సంఘాలు	వివరాలు
వీఆర్ఎస్	10	మక్కువ- 7, సీతానగరం- 1, బొబ్బిలి- 2
ఒట్టిగెడ్డ	09	జియ్యమ్మవలస- 8, గరుగుబిల్లి- 1
పెద్దగెడ్డ	06	సాలూరు-1, పాచిపెంట-3, ఆర్‌బీపురం-2
పెదంకలాం	05	బలిజిపేట- 4, వంగర- 1
పారాది	05	బొబ్బిలి- 3, బాడంగి- 2

డీఎస్సీ శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

పార్వతీపురం, న్యూస్‌టుడే: ఉపాధ్యాయ నియామక పరీక్షకు హాజరయ్యే ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు శిక్షణ ఇచ్చేందుకు సంస్థల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు జిల్లా సాంఘిక సంక్షేమ సాధికారిత అధికారి గయాజుద్దీన్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. సంబంధిత సంస్థలు అభ్యర్థులకు ఉచితంగా వసతి కల్పించాలని, సాంఘిక, గిరిజన సంక్షేమశాఖలు నిర్వహిస్తున్న స్టడీ సర్కిళ్లలో తరగతులు నిర్వహించాలన్నారు. సంస్థ ఆదాయం గత మూడేళ్లలో రూ.40 లక్షలతో పాటు ఇప్పటికే రెండు డీఎస్సీల్లో శిక్షణ ఇచ్చిన అనుభవం తప్పనిసరి అని పేర్కొన్నారు. అక్కడ నుంచి పరీక్షకు వెళ్లిన వారిలో కనీసం వంద మంది ఉద్యోగాలు సాధించి ఉండాలన్నారు. దరఖాస్తులను ఈనెల 21 వరకు సమర్పించే అవకాశం ఉందని చెప్పారు.

ఏబీ రోడ్డులో ప్రయాణం నరకం


కూరుకుపోయిన ఇసుక లారీ

పార్వతీపురం మన్యం, శ్రీకాకుళం జిల్లాలతో పాటు ఒడిశా రాష్ట్రానికి వెళ్లేందుకు కీలక మార్గంగా ఉన్న భామిని మండలంలోని అలికాం-బత్తిలి(ఏబీ) రోడ్డు అధ్వానంగా దర్శనమిస్తోంది. కొరమ బగ్గామర్రి పాడు గెడ్డ నుంచి బత్తిలి వరకు సుమారు 27 కి.మీ. మేర ఈ మార్గం విస్తరించి ఉంది. ఏళ్ల క్రితం నిర్మించినది కావడంతో భారీ గుంతలు ఏర్పడ్డాయి. గత అయిదేళ్లలో నాటి వైకాపా ప్రభుత్వం కనీసం పట్టించుకోకపోవడంతో నేటికీ ఆ కష్టాలు వెంటాడుతున్నాయి. మంగళవారం పెద్దదిమిలి సమీపంలో భారీ వాహనం కూరుకుపోయింది. వంశధార నదిలో ఇసుక తవ్వకాలకు ఒడిశా అనుమతులు ఇవ్వడంతో ఇటుగా లారీల రాకపోకలు పెరిగాయి. దీంతో ఈ రహదారిలో ప్రయాణాలు నరకప్రాయంగా మారాయి.

– న్యూస్‌టుడే, భామిని

అందరి చూపు.. విజయనగరం వైపు


భోగాపురంలోని అబ్కారీ సర్కిల్ కార్యాలయంలో దరఖాస్తుల ప్రక్రియను పరిశీలిస్తున్న ఏసీ రామచంద్రరావు

ఈనాడు, పార్వతీపురం మన్యం, న్యూస్‌టుడే, భోగాపురం: మద్యం నూతన పాలసీలో భాగంగా ప్రైవేటు దుకాణాల్లో అమ్మకాలకు ప్రభుత్వం ఇప్పటికే ఆదేశాలు జారీ చేసింది. దీంతో దుకాణాలు దక్కించుకునేందుకు దరఖాస్తుదారులు పోటీ పడుతున్నారు. ఉమ్మడి శ్రీకాకుళం, విశాఖపట్నం జిల్లాల నుంచి ఎక్కువ మంది వ్యాపారులు విజయనగరం వైపు చూస్తున్నారు. ఈమేరకు తమ అనుచరులను రంగంలోకి దించి.. అన్ని ప్రాంతాలకూ పంపించి దరఖాస్తులు చేయిస్తున్నారు.

కొత్తవారిలో ఉత్సాహం..

రెండు జిల్లాల్లో 205 దుకాణాల ఏర్పాటుకు అవకాశం ఉంది. దీంతో ఈ సారి కొత్తవారు సైతం వ్యాపారంలో అడుగుపెట్టేందుకు ఉత్సాహం చూపుతున్నారు. విశాఖపట్నం, విజయవాడ, బెంగళూరు, హైదరాబాద్‌లో ప్రైవేటు సంస్థల్లో ఉద్యోగాలు చేస్తున్న వారు.. వివిధ వ్యాపారాలు చేస్తున్నవారు, ప్రభుత్వ ఉద్యోగులు సైతం వీరిలో ఉన్నారు. బొబ్బిలి మండలంలో ఓ కుటుంబంలో అందరూ ఉద్యోగం చేస్తుండటంతో ఇంటి పెద్దావిడ పేరిట దరఖాస్తు చేయించారు. రూ.2 లక్షల చొప్పున కట్టాల్సి ఉన్నా.. ఎవరూ వెనకడుగు వేయడం లేదు.

11 వరకు అవకాశం

ఈనెల ఒకటిన దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ప్రారంభమైంది. శుక్రవారం సాయంత్రం 5 గంటలతో ముగియనుంది. తొలి ఏడు రోజుల్లో రికార్డు స్థాయిలో 3,214 దరఖాస్తులు దాఖలయ్యాయి. ఈ వివరాలన్నీ సులువుగా తెలుసుకోవచ్చని, ఈమేరకు ఎప్పటికప్పుడు వెబ్‌సైట్‌ను నవీకరిస్తున్నామని అబ్కారీశాఖ ఏసీ రామచంద్రరావు తెలిపారు. ఆయన మంగళవారం భోగాపురంలోని సర్కిల్ కార్యాలయాన్ని పరిశీలించారు.

పైడితల్లికి సేవాపీఠం బోనాలు



అలంకరణలో వనంగుడి పైడితల్లి

పైడితల్లి అమ్మవారి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం ఉత్తరాంధ్ర జిల్లాల భవానీల దీక్ష సేవా పీఠం సంబరాలు భక్తులను ఆకట్టుకున్నాయి. రైల్వేస్టేషన్ వనంగుడి నుంచి సీఎంఆర్, ఎన్సీఎస్, దాబాతోట, కన్యకాపరమేశ్వరి ఆలయం, గంటస్తంభం మీదుగా పైడితల్లి చదురుగుడికి చేరింది. అమ్మవారికి పట్టువస్త్రాలు, ఎదురు ఘటాలు, బోనాలు సమర్పించారు. ఊరేగింపులో డప్పు వాయిద్యాలు సందడి చేశాయి. – న్యూస్‌టుడే, కంటోన్మెంట్



ఘటాలతో వస్తున్న మహిళలు



చదురుగుడిలో భక్తులతో కిక్కిరిసిన క్యూలైన్లు



ఘటాలు తీసుకువస్తున్న ఉత్తరాంధ్ర భవానీల దీక్ష సేవా పీఠం సభ్యులు

రెండు వేల మందితో భద్రత

విజయనగరం నేరవార్తా విభాగం, న్యూస్‌టుడే: అమ్మవారి ఉత్సవాలకు పెద్ద సంఖ్యలో రానున్న భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా రెండు వేల మందితో భద్రత ఏర్పాట్లు చేస్తున్నామని విశాఖపట్నం రేంజ్ డీఐజీ గోపీనాథ్ జట్టీ తెలిపారు. విజయనగరం ఉత్సవాలు, పైడితల్లమ్మ అమ్మవారి తొలేళ్ల, సిరిమానోత్సవం పండుగ సందర్భంగా పోలీసు శాఖ ఏర్పాటు చేస్తున్న బందోబస్తు, భద్రత ఏర్పాట్లను మంగళవారం ఆయన ఎస్పీ వకుల్ జిందాల్, అదనపు ఎస్పీ పి.సౌమ్యలతతో కలిసి పరిశీలించారు. దేవాలయం, క్యూలైన్లు, దేవాలయం వెనుక భాగం, కమాండ్ కంట్రోల్ రూం, మూడులాంతర్లు, గురజాడ అప్పారావు రోడ్డు, కోట కూడలి ప్రాంతాలు, గుర్తించిన పాత భవనాలను సందర్శించారు. క్షేత్ర స్థాయిలో భద్రత ఏర్పాట్లను తనిఖీ చేసి.. అనంతరం పోలీసు కార్యాలయంలో అధికారులతో సమీక్షించారు. దర్శనాలకు వచ్చే వృద్ధులు, దివ్యాంగులు, గర్భిణులకు సేవలందించేందుకు పోలీసు అధికారులు, సిబ్బందితో సేవాదళ్‌ను ఏర్పాటు చేయాలన్నారు. డీఎస్పీలు ఎం.శ్రీనివాసరావు, పి.శ్రీనివాసరావు, ఎస్.రాఘవులు, సీఐలు ఏవీ లీలారావు, ఆర్‌వీఆర్‌కే.చౌదరి, ఎన్.శ్రీనివాస్, టి.శ్రీనివాసరావు, ఎస్.లక్ష్మణరావు, సూరి నాయుడు, దేవాలయ, ఆర్‌అండ్‌బీ అధికారులు పాల్గొన్నారు.



సిరిమాను తిరిగే ప్రాంతాన్ని పరిశీలిస్తున్న డీఐజీ గోపీనాథ్ జట్టీ, ఎస్పీ వకుల్ జిందాల్ తదితరులు

గిరిజన గర్భిణులకు మంచి రోజులు

వసతి గృహాలకు సొంత భవనాలు



సీతంపేట ఏర్పాటైన వసతి గృహంలో గర్భిణులు

సీతంపేట, పార్వతీపురం, గుమ్మలక్ష్మీపురం, సాలూరు గ్రామీణం, న్యూస్‌టుడే: గిరిజన ప్రాంతాల్లో మాతా, శిశుమరణాల నివారణలో భాగంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు చేపడుతున్నాయి. ఇప్పటికే గర్భిణుల ఆరోగ్య సంరక్షణకు రాష్ట్ర వ్యాప్తంగా వసతి గృహాలు నెలకొల్పారు. ఐటీడీఏ ఆధ్వర్యంలో జిల్లాలో సీతంపేట, సాలూరు, గుమ్మలక్ష్మీపురంలో నిర్వహిస్తున్నారు. వీటి నుంచి మంచి ఫలితాలే వస్తున్నా యువత శిక్షణ కేంద్రాల్లో కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో వసతి గృహాలను సొంత భవనాల్లో నిర్వహించేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఒక్కో భవనానికి రూ.35 లక్షల చొప్పున మంజూరు చేసింది.

ఎప్పటికప్పుడు వైద్య పరీక్షలు, స్కానింగ్ చేస్తారు. పురిటి నొప్పులు వస్తే సమీప ప్రభుత్వ ఆసుపత్రులకు తరలిస్తారు.

బలవర్థక ఆహారం..

ఇటీవల సీతంపేట వైటీసీలో వసతి గృహం ప్రారంభమైంది. ఇక్కడ రెండు గదుల్లో 16 మంది గర్భిణులు ఉండేలా పడకలు ఏర్పాటు చేశారు. టీవీ, ఇతర సౌకర్యాలు సమకూర్చారు. ఉదయం రాగి ముద్దతో మొదలు రాత్రి వరకు బలవర్థకమైన ఆహారం పెడుతున్నారు. గర్భిణుల సహాయకులకు ఆహారం అందజేస్తున్నారు. త్వరలో అన్ని వసతిగృహాలకు సొంత భవనాలు ఏర్పాటుచేయనున్నట్లు డీఎంహెచ్‌వో విజయపార్వతి తెలియజేశారు.

మూడు కేంద్రాల్లో ఇలా..

ప్రాంతం	సేవలు పొందింది	ప్రస్తుతం ఉన్నది
గుమ్మలక్ష్మీపురం	2,057	24
సాలూరు	1,730	14
సీతంపేట	43	11

నిరంతర పర్యవేక్షణ..

గిరి శిఖర, మారుమూల గిరిజన గ్రామాల్లో గర్భిణులను వసతి గృహాలకు తీసుకొచ్చి సేవలు అందిస్తున్నారు. పోషకాహారంతో పాటు ప్రసూతి వైద్య నిపుణురాలు, ఆశ, అంగన్‌వాడీ, ఆరోగ్య కార్యకర్తలు పర్యవేక్షిస్తారు.

పట్టణాల్లో అంధకారం



జిల్లాలోని పట్టణాల్లో వీధి దీపాల నిర్వహణ అధ్వానంగా ఉంది. చాలా చోట్ల సక్రమంగా దీపాలు వెలగక ప్రజలు అవస్థలు పడుతున్నారు. రాత్రి వేళ విధులు ముగించుకొని ఇళ్లకు చేరే వారు చీకట్లలో ఆందోళన చెందుతున్నారు. శివారు కాలనీల్లో పరిస్థితి దయనీయంగా మారింది. పాడైన కల్వర్టులు, గుంతలు పడిన దారుల్లో ఇళ్లకు చేరేలోపు ప్రమాదాలకు గురవుతున్నారు.
-న్యూస్‌టుడే, పార్వతీపురం పట్టణం, పాలకొండ, సాలూరు గ్రామీణం

కొత్త దీపాలు వేయాలి..

పట్టణం: పార్వతీపురం
- వార్డులు: 30
- జనాభా: 62వేలు
- వీధి దీపాలు: 2,500
- పనిచేయనవి: 200లకు పైగా


పార్వతీపురం పురపాలికలో బెలగాం, జగన్నాథపురం, కొత్తవలస, కొత్తబెలగాం, వైకేఎంకాలనీ తదితర ప్రాంతాల్లో వీధి దీపాలు వెలగడం లేదు. చర్చివీధి, అగ్రహారం వీధి, జనశక్తి కాలనీ, బైపాసుకాలనీ, గణేష్‌నగర్ కాలనీ, ఆసుపత్రి రోడ్డులోనూ ఇదే పరిస్థితి. విశాఖ నుంచి రాత్రి 11 గంటల తర్వాత కొత్త రైలు పార్వతీపురం చేరుతుంది. ఇక్కడ దిగే ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. బైపాసు రోడ్డు, గూడ్స్‌షెడ్, గొబ్బిలివీధి, తహసీల్ కార్యాలయం, సౌందర్య మార్గం, కృష్ణపల్లి వెళ్లే మార్గాల్లో కొత్త దీపాలు వేయాల్సి ఉంది.



శివారులో చీకట్లు..

పట్టణం: సాలూరు
- వార్డులు: 29
- జనాభా: 52వేలు
- వీధి దీపాలు: 1,586
- పనిచేయనవి: 200లకు పైగా

సాలూరు పట్టణంలో ప్రధాన కూడళ్లతో పాటు శివారు కాలనీల్లో అంధకారం అలుముకుంటోంది. ఆర్టీసీ కాంప్లెక్సు మార్గం, రైల్వేస్టేషన్ రోడ్డు, చిన హరిజనపేట వీధి, బంగారమ్మకాలనీ, వేంకటేశ్వర, శ్రీనివాస కాలనీల్లోని మార్గాల్లో దీపాలు వెలగడం లేదు.



రాత్రి వేళ ఆందోళన..

పట్టణం: పాలకొండ
- వార్డులు: 20
- జనాభా: 45వేలు
- వీధి దీపాలు: 1,723
- పనిచేయనవి: 300లకు పైగా

పాలకొండ పట్టణంలో ఆర్టీసీ కాంప్లెక్సు చుట్టుపక్కల ప్రధాన మార్గాల్లో కొన్ని చోట్ల దీపాలు వెలగడం లేదు. వడమ కాలనీ, సీతంపేట మార్గం, మార్కెట్ రోడ్డు, అన్నవరం మార్గం తదితర ప్రాంతాల్లో రాత్రివేళ బయట తిరిగేందుకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల దొంగలు సైతం విజృంభిస్తుండటంతో రాత్రి వేళ విధులు ముగించుకొని వచ్చే వారు భయాందోళనకు గురవుతున్నారు.



ఫిర్యాదులు వస్తే సరిచేస్తున్నాం..

వీధి దీపాల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నాం. జిల్లా కేంద్రంలో గుత్తేదారు నిర్వహణ సమయం ముగిసింది. ప్రస్తుతం పురపాలిక సంఘం పనులు చేస్తోంది. మరో ఏడాది పాటు గుత్తేదారుకు అప్పగించే ప్రయత్నం చేస్తున్నాం. పాలకొండ, సాలూరు పట్టణాల్లో ఫిర్యాదులు వస్తే సమస్య పరిష్కరిస్తున్నాం.
– కిరణ్ కుమార్, శివప్రసాద్, దేవీప్రసాద్, డీడీఈ, మేనేజరు, ఏఈ, పార్వతీపురం, సాలూరు, పాలకొండ

జాతీయ పోటీలకు ఎంపికైన వారికి సహకారం

విజయనగరం విద్యావిభాగం, న్యూస్‌టుడే: రాష్ట్ర స్థాయి 37వ జూనియర్ అథ్లెటిక్స్ పోటీల్లో సత్తా చాటిన జిల్లా క్రీడాకారులను మంగళవారం సంయుక్త కలెక్టర్ సేథు మాధవన్ తన ఛాంబర్లో అభినందించారు. జాతీయ పోటీలకు అర్హత పొందిన వారికి అన్ని విధాలా సహకారమందిస్తామని హామీ ఇచ్చారు. పోటీల్లో 20 పతకాలు సాధించగా.. వాటిల్లో స్వర్ణం 11, రజతం-6, కాంస్యం- 3 పతకాలున్నాయి. జిల్లా క్రీడాభివృద్ధి అధికారి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.



రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల విజేతలతో జేసీ సేథు మాధవన్, డీఎస్‌వో తదితరులు

కేజీబీవీల్లో బోధనేతర ఉద్యోగాలకు దరఖాస్తుల ఆహ్వానం

విద్యావిభాగం, పార్వతీపురం పట్టణం: కేజీబీవీల్లో (టైప్-3,4) ఖాళీగా ఉన్న బోధనేతర సిబ్బంది పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు విజయనగరం, పార్వతీపురం మన్యం డీఈవోలు ఎన్.ప్రేమకుమార్, పగడాలమ్మ తెలిపారు. పొరుగు సేవల ప్రాతిపదికన ఏడాది కాలానికి నియమించనున్నారు. దరఖాస్తులు స్వీకరణ ఈ నెల 7 నుంచి ప్రారంభమైంది. 15 వరకు దరఖాస్తు చేసుకునేందుకు గడువును నిర్దేశించారు. విజయనగరం జిల్లాలో సహాయ వంటపనివారు 25, రాత్రి, పగలు కాపలాదారులు 9, స్కావెంజర్ 11, స్వీపర్లు 2, చౌకీదారులు 6, హెడ్ కుక్‌ల విభాగంలో రెండు ఖాళీలున్నాయి. మన్యం జిల్లాలో వంటమనిషి పోస్టులు- 5, సహాయకులు 13, మహిళా కాపలాదారులు- 2, స్వీపర్ -2, చౌకీదార్ ఖాళీలు 3 ఉన్నట్లు చెప్పారు. ఈనెల 15 లోపు ఆఫ్‌లైన్‌లో డీఈవో కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించాలన్నారు.

సుజికి వాహనాల కొనుగోళ్లపై ఆఫర్లు

విజయనగరం రింగురోడ్డు, న్యూస్‌టుడే: విజయనగరంలోని వీటీ.అగ్రహారంలో ఉన్న వేణుగోపాల్ మోటార్స్‌లో వాహనాల కొనుగోళ్లపై క్యాష్‌బ్యాక్ ఆఫర్లు ఇస్తున్నట్లు జనరల్ మేనేజర్ చిన్ని ప్రవీణ్‌కుమార్ తెలిపారు. ప్రతి యాక్సెస్ కొనుగోలుపై రూ.3,500, బర్గ్‌మ్యాన్‌పై రూ.4,500 క్యాష్ బ్యాక్ ఉంటుందని చెప్పారు. ప్రతి ద్విచక్ర వాహనంపై రూ.20 వేల వరకు ప్రయోజనాలతో పాటు ఒక గ్రాము గోల్డ్ కాయిన్ ఉచితంగా ఇస్తున్నట్లు తెలిపారు. పాత ద్విచక్ర వాహనాలను మార్చుకునే అవకాశం ఉందన్నారు.

విశాఖ-రాయపూర్ రైలు వేళల మార్పు

రైల్వేస్టేషన్ (విశాఖపట్నం), న్యూస్‌టుడే: తూ.కో. రైల్వే జీఎం పరమేశ్వర్ ఫంక్వాల్ హామీమేరకు విశాఖ-రాయపూర్(08528) మధ్య నడిచే రైలు వేళలు ఈ నెల 20 నుంచి విశాఖలో ఉదయం 6.30కు బదులు ఉదయం 4.25 గంటలకు బయలుదేరేలా మార్చారు. 4.43 గంటలకు సింహాచలం, 5.05కు కొత్తవలస, 5.50కు విజయనగరం, 7.08కు బొబ్బిలి, 7.40కు పార్వతీపురం, 7.48కు పార్వతీపురం పట్టణం, 9.15 గంటలకు రాయగడ చేరుకోనుంది.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

సీతానగరం, న్యూస్‌టుడే: సాంకేతిక విద్య పూర్తిచేసి కుటుంబానికి అండగా నిలుస్తాడని భావించిన కుమారుడి అకాల మరణంతో తల్లిదండ్రులు బోరుమన్నారు. సీతానగరం మండలంలో జరిగిన ఘటనకు సంబంధించి పోలీసుల వివరాల మేరకు.. ఆర్.వెంకంపేట గ్రామానికి చెందిన ప్రభు, ధనలక్ష్మిల కుమారుడు వి.సాగర్ (20) ఐటీఐ పూర్తి చేసి వెల్డింగు దుకాణంలో పని చేస్తున్నాడు. మంగళవారం వెల్డింగు సామగ్రి కోసం ద్విచక్ర వాహనంపై సీతానగరం వచ్చి ఇంటికి వెళ్తున్నాడు. ఇదే సమయంలో పాచిపెంటకు చెందిన వై.బాలయ్య, బంగారుదొర మరో ద్విచక్రవాహనంపై సీతానగరం వెళ్తున్నారు. ఈ రెండు వాహనాలు చినభోగిల- కాశాపేట మధ్య పెట్రోల్ బంకు సమీపంలో ఢీకొన్నాయి. సాగర్‌కు తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మిగిలిన ఇద్దరికీ స్వల్ప గాయాలు అయ్యాయి. విషయం తెలుసుకున్న సాగర్ కుటుంబ సభ్యులు ఘటనా స్థలానికి చేరుకొని బోరున విలపించారు. ఎస్సై రాజేష్ కేసు నమోదు చేశారు.



రోదిస్తున్న తల్లిదండ్రులు



సాగర్ (పాతచిత్రం)

రహదారి ప్రమాదంలో ఎనిమిది మందికి గాయాలు

దత్తిరాజేరు, న్యూస్‌టుడే: కారు, ఆటో ఢీకొన్న ప్రమాదంలో ఎనిమిది మందికి గాయాలైన ఘటన దత్తిరాజేరు మండలంలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ ఐ.రాజేష్ వివరాల మేరకు.. కోరప కృష్ణాపురం వద్ద జాతీయ రహదారిపై మంగళవారం వెళ్తున్న కారు, ఆటో ఢీకొన్నాయి. ప్రమాదంలో ఆటోలో ఉన్న కోరప కృష్ణాపురం గ్రామస్థులు ఎస్.వరహాలమ్మ, ఎస్.సత్యవతి, ఆర్.రాము, పి.కృష్ణమ్మ, సి.లక్ష్మి, తెర్లాం గ్రామానికి చెందిన కె.జితేంద్ర, కె.బంగారమ్మ, ఎం.రాము గాయపడ్డారు. వీరిని గజపతినగరం ప్రాంతీయ ఆసుపత్రికి తరలించారు. ఎస్.వరహాలమ్మ, ఎస్.సత్యవతిని మెరుగైన చికిత్స నిమిత్తం విజయనగరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

ఆటోను బైక్ ఢీకొని..

డెంకాడ, న్యూస్‌టుడే: లగేజీ ఆటోను ద్విచక్రవాహనం ఢీకొని ఇద్దరు యువకులకు తీవ్ర గాయాలైన ఘటన మంగళవారం విజయనగరం నుంచి నాతవలస వెళ్లే రహదారిలో డెంకాడ పోలీస్‌స్టేషన్ ఎదురుగా చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసుల వివరాల ప్రకారం.. పూసపాటిరేగ మండలం వెంపడాం గ్రామానికి చెందిన పి.గురునాయుడు, దుర్గారావు ద్విచక్రవాహనంపై విజయనగరం వైపు వెళ్తున్నారు. ఎదురుగా వచ్చిన లగేజీ ఆటోను బలంగా ఢీకొట్టారు. గురునాయుడు తలకు తీవ్రగాయమై అపస్మారకస్థితికి చేరుకున్నాడు. పరిస్థితి విషమంగా ఉండడంతో 108 వాహనంలో విజయనగరం జిల్లాకేంద్రాసుపత్రికి తరలించారు. దుర్గారావు గాయాలతో బయటపడ్డాడు. కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఉద్యోగాల పేరిట నిరుద్యోగులకు వల

నకిలీ కన్సల్టెన్సీ గుట్టురట్టు

అక్కయ్యపాలెం, న్యూస్‌టుడే: ప్రైవేటు జాబ్ మేళా పేరుతో ఓ కన్సల్టెన్సీ సంస్థ ఎటువంటి కంపెనీలతో ఒప్పందం లేకుండానే నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇప్పిస్తామని నకిలీ పత్రాలతో మోసం చేయడానికి ప్రయత్నించింది. విజయనగరం, ఎస్.కోట, శ్రీకాకుళం, పార్వతీపురం గ్రామీణ ప్రాంతాలకు చెందిన నిరుద్యోగులను ఉద్యోగం వచ్చిందని నమ్మించి ధ్రువపత్రాలు తీసుకుని నగదు కాజేసే ప్రయత్నం చేసింది. మంగళవారం ఉదయం విశాఖలోని దొండపర్తికి వచ్చిన ఆయా ప్రాంతాలకు చెందిన నిరుద్యోగ యువత గురించి తెలుసుకున్న ఎ.పి. నిరుద్యోగ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సమయం హేమంత్‌కుమార్ స్వయంగా వెళ్లి నిర్వాహకులతో మాట్లాడారు. ఉద్యోగాలకు సంబంధించి ఎటువంటి హామీ లేదని, అంతా ఉత్తుత్తిదేనని తెలుసుకుని నిరుద్యోగులకు తెలిపి మోసపోకుండా నిలువరించారు. నిరుద్యోగులకు వారి ధ్రువపత్రాల్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా నిరుద్యోగులు, విద్యార్థులు, తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రతి జాబ్ మేళాకు ఒక తహసీల్దారును పర్యవేక్షణాధికారిగా నియమించాలని జిల్లా కలెక్టర్‌ను కోరుతున్నానని తెలిపారు.

జాతీయస్థాయిలో ప్రతిభ

చీపురుపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: జమ్మూ కశ్మీర్‌లో గతనెల 30 నుంచి ఈనెల 4వ తేదీ వరకు జరిగిన 36వ జాతీయస్థాయి టెన్నికాయిట్ పోటీల్లో చీపురుపల్లి మండలం పెదనడిపల్లి జడ్పీ ఉన్నత పాఠశాల 9వ తరగతి విద్యార్థిని కిల్లారి ఇందు రెండు పతకాలను సాధించింది. మిక్స్‌డ్ డబుల్స్ విభాగంలో అనంతపురం జిల్లాకు చెందిన జి.మహీధర్‌తో కలిసి స్వర్ణ పతకాన్ని, టీం విభాగంలో రజిత పతకాన్ని సాధించినట్లు హెచ్‌ఎం ఎం.శ్రీనివాసరావు, పీడీ ఎం.రామారావు తెలిపారు.



ఉపాధ్యాయులతో కిల్లారి ఇందు

చికెన్ ధరలు

రకం	(బ్యాగ్)లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
బ్రాయిలర్	130	230	240

తొలగని ఆటంకాలు.. పూర్తికాని నిర్మాణాలు

న్యూస్‌టుడే, చీపురుపల్లి

20 నెలలుగా మూలుగుతున్న చీపురుపల్లి వంతెన పనులు

ఉత్తరాంధ్ర జిల్లాలతో పాటు ఒడిశాకు ప్రధాన మార్గమైన విజయనగరం - పాలకొండ రహదారిలో చీపురుపల్లి వద్ద ఆర్వోబీ నిర్మాణాలకు ఆటంకాలు తొలగకపోవడంతో పనులు ముందుకు సాగడంలేదు. పురాతన కాలంలో నిర్మించిన వంతెన శిథిలావస్థలకు చేరుకోవడంతో రెండున్నర ఏళ్ల కిందట భారీ వాహనాల రాకపోకలను నిషేధించారు. 2022 ఆగస్టు 16న వంతెన నిర్మాణానికి కేంద్ర రైల్వే బోర్డు రూ.12.97 కోట్లు నిధులు మంజూరు చేయడంతో.. గతేడాది మార్చిలో పనులను ప్రారంభించారు. 20 నెలలు గడుస్తున్నా.. పనులు పూర్తికాని దుస్థితి. దాంతో అత్యవసర సమయాల్లో ప్రజలు నానా యాతన పడాల్సివస్తోంది.

సర్వీసు రహదారి రగడ..

వంతెన నిర్మాణానికి సంబంధించి చీపురుపల్లి వైపు సిమెంట్ కాంక్రీటు పనులు జరుగుతుండగా.. గత నెల స్థానికులు అభ్యంతరం వ్యక్తం చేశారు. గోడ నిర్మిస్తే కొత్తఅగ్రహారం, రిక్షాకాలనీతో పాటు పలు గ్రామాలకు రాకపోకలకు మార్గం ఉండదని, సర్వీసు రహదారి సదుపాయం కల్పించాలంటూ ఆందోళన వ్యక్తం చేయడంతో పనులు నిలిపేశారు. సర్వీసు రహదారి సదుపాయం కల్పించడానికి.. రోడ్డుకు ఆనుకుని ఉన్న దుకాణాలను కొంత వరకు కొట్టాల్సిఉందని అధికారులు అంటున్నారు. ర.భ, రైల్వే అధికారులు కొద్ది రోజుల కిందట పరిశీలించి మార్కింగ్ ఇచ్చారు. తొలగించాలని యజమానులకు సూచించారు. వంతెనకు సంబంధించి మిగతా పనులు జరుగుతున్నా.. కీలకమైన కాంక్రీట్ గోడ నిర్మాణం నిలిచిపోవడంతో దీని ప్రభావం మొత్తం పనిపై పడే అవకాశముందని అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.



నిలిచిన కాంక్రీటు గోడ నిర్మాణ పనులు

త్వరితగతిన పూర్తయ్యేలా చూస్తాం..

ఆర్వోబీ నిర్మాణ పనులు చురుగ్గా జరిగేలా చూస్తాం. సర్వీసు రహదారి నిర్మాణానికి దుకాణాలను కొంతవరకు తొలగించాలని యజమానులకు ర.భ. అధికారులు, గుత్తేదారుని ప్రతినిధులు సూచించారు. ర.భ. డీఈ సమక్షంలో తాము పనులు చేయిస్తామని గుత్తేదారుడు అంటున్నారు. డీఈతో మాట్లాడి పనులు జరిగేలా చూస్తాం. – ఎల్.దామోదరరావు, ఎస్సై, చీపురుపల్లి

ఉపాధ్యాయులపై భారం తగ్గించాలి

ఏపీటీఎఫ్ ప్రతినిధుల సభలో వక్తలు

విజయనగరం విద్యావిభాగం, న్యూస్‌టుడే: భవిష్యత్తులో శాశ్వత ప్రాతిపదికనే ఉపాధ్యాయ నియామకాలు చేపట్టాలని, ప్రస్తుతమున్న యాప్‌ల భారాన్ని తగ్గించాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు జి.హృదయరాజు, ఎస్.చిరంజీవి పేర్కొన్నారు. విజయనగరంలో మూడు రోజుల పాటు జరిగిన ఏపీటీఎఫ్ రాష్ట్ర మహాసభల ముగింపు సందర్భంగా వారు మాట్లాడారు. ఉపాధ్యాయులకు స్వేచ్ఛాయుత బోధనకు అవకాశం కల్పించాలని, యాప్‌ల భారాన్ని తగ్గించి, మరుగుదొడ్ల చిత్రీకరణకు ప్రత్యేక సిబ్బందిని నియమించాలని సూచించారు. ప్రస్తుతమున్న 48 పీరియడ్లను 32కు కుదించాలని, ఉద్యోగ, ఉపాధ్యాయ, పింఛనర్ల ప్రయోజనాల డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. పురపాలక ఉపాధ్యాయుల సర్వీసు నిబంధనలు, ఇతరత్రా అంశాల్లో సంఘాలతో చర్చించి పరిష్కారం చూపాలన్నారు. రాష్ట్ర గౌరవాధ్యక్షుడు ఎ.సదాశివరావు, ఉపాధ్యక్షుడు డి.ఈశ్వరరావు, ఉప కమిటీ సభ్యులు 26 జిల్లాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, రాష్ట్ర కౌన్సిలర్లు, జిల్లా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న హృదయరాజు

స్పందించారు.. పరిష్కారం చూపారు



ప్లాట్‌ఫారాల నిర్మాణం

గరుగుబిల్లి, న్యూస్‌టుడే: బోరుబావుల చుట్టూ ప్లాట్‌ఫారాలు పాడయ్యాయని, నీరు పట్టేందుకు ఇబ్బందులు పడుతున్నామని సెప్టెంబరు రెండో వారంలో గరుగుబిల్లి గ్రామస్థులు 'ఈనాడు' మేమున్నాం.. మీకు తోడుగాకు తెలియజేశారు. వార్త ప్రచురితమవగా సర్పంచి కె.ఇందుమతి స్పందించారు. గ్రామంలోని రెండు బోర్ల చుట్టూ ప్లాట్‌ఫారాల నిర్మాణాలు చేపట్టారు.

కాలువల్లో పూడిక తీత

స్పందనకు వందనం

సీతానగరం: కె.ఎస్.పురం గ్రామంలో పక్కా కాలువలు, వీధి దీపాల సమస్యలపై గ్రామస్థులు ఈ నెల 1న 'ఈనాడు' 'మేమున్నాం.. మీకు తోడుగా'కు విన్నవించారు. సమస్యను పంచాయతీ కార్యదర్శి కామేశ్వరరావు దృష్టికి తీసుకువెళ్లగా ఆయన స్పందించారు. సర్పంచి విజయలక్ష్మి ఆధ్వర్యంలో మంగళవారం కాలువల్లో పూడిక తీత పనులు చేపట్టారు

వినియోగంలోకి మోటారు

గుమ్మలక్ష్మీపురం, న్యూస్‌టుడే: గుమ్మలక్ష్మీపురం రజక వీధిలో మోటారు ప్యానల్ బోర్డు మరమ్మతులకు గురవడంతో స్థానికులు నీటి కోసం ఇబ్బందులు ఎదుర్కొన్నారు. సమస్యను ఈ నెల 7న 'మేమున్నాం.. మీకు తోడుగా'కు తెలియజేశారు. వార్త ప్రచురించగా సర్పంచి గౌరీశంకరరావు స్పందించారు. మోటారు మరమ్మతు పనులు చేయించారు.

పెదపెంకిలో పారిశుద్ధ్య పనులు



బలిజిపేట గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని పెదపెంకిలో సర్పంచి ఎన్.పాపారావు ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శి తిరుపతిరావు మంగళవారం పారిశుద్ధ్య పనులు చేపట్టారు. 'పెదపెంకి ప్రతి విధిలోనూ సమస్యలే' శీర్షికతో 'ఈనాడు'లో సోమవారం కథనం ప్రచురితమైంది. జిల్లాస్థాయి అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని ఆదేశాలు జారీ చేయడంతో మంగళవారం పారిశుద్ధ్య పనులు చేపట్టారు.



పరిసరాలు శుభ్రం

గరుగుబిల్లి, న్యూస్‌టుడే: పెద్దూరు గ్రామంలో చెత్త పేరుకుపోవడంతో పరిసరాలు అపరిశుభ్రంగా మారాయి. దీంతో అవస్థలు పడుతున్నామని గ్రామస్థులు ఆగస్టు 30న ఈనాడు 'మేమున్నాం.. మీకు తోడుగా'కు తెలియజేశారు. వార్త ప్రచురించగా.. ఉప సర్పంచి ఎల్లంనాయుడు స్పందించారు. ఈవోపీఆర్‌డీ సమక్షంలో గ్రామంలో వ్యర్థాలను బ్లేడు ట్రాక్టరు సాయంతో తొలగించారు.

వైద్యులు ఉండరు.. ఉపాధ్యాయులు రారు

ఎమ్మెల్యే ప్రజాదర్బారుకు 183 అర్జీలు



వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే జగదీశ్వరి

కొమరాడ, న్యూస్‌టుడే: ప్రజా సమస్యల పరిష్కారానికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని కూనేరులో జరిగిన ప్రజాదర్బారులో వివిధ గ్రామాలకు చెందిన ప్రజలు 183 అర్జీలు సమర్పించారు. పింఛన్లకు సంబంధించి 45, పీఆర్ రహదారులు- 18, గృహ నిర్మాణం- 58, రెవెన్యూ- 37, తాగునీటి సమస్యలు-07, విద్యుత్తు శాఖ- 05, విద్యాశాఖ- 07, అంగన్‌వాడీ- 02, ఐటీడీఏ ఇంజినీరింగ్ శాఖపై 2, ఇతరత్రా 2 ఫిర్యాదులు వచ్చాయి. కార్యక్రమంలో తెదేపా, భాజపా, జనసేన నాయకులు శేఖర్‌పాత్రుడు, డి.వి. నాయుడు, జి.సుదర్శనరావు, ఎన్.మధు, పి.వి.నాయుడు, ఎంపీడీవో మల్లికార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

ఫిర్యాదుల్లో కొన్ని..

గిరిజన గ్రామాలకు రహదారులు లేక డోలీ మోతలు తప్పడం లేదని పలువురు వినతులు అందజేశారు. అటవీ అనుమతులు రావడంలో జాప్యంతో పనులు జరగడం లేదన్నారు. ★ కూనేరు- రామభద్రపురం ఆసుపత్రులకు వైద్యులు విధులకు సకాలంలో రావడం లేదని కొందరు ఫిర్యాదు చేశారు. ★ తోటపల్లి బ్యారేజీ నిర్మాణంతో గుణానపురం ముంపునకు గురైందని, 175 మందికి ఇళ్ల స్థలాలు ఇంకా రాలేదని నిర్వాసితులు వినతి పత్రం ఇచ్చారు. ★ మన్యంలో ఉపాధ్యాయుల కొరత ఉందని, కొందరు సమయపాలన పాటించడం లేదని పలువురు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. ★ కొట్టు గ్రామంలో విద్యుత్తు స్తంభాలు తుపాన్ల సమయంలో విరిగాయని, తీగలు వేలాడుతూ ప్రమాదకరంగా మారాయని గ్రామస్థులు తెలిపారు. తీసుకొచ్చిన కొన్ని స్తంభాలు వృథాగా వదిలేశారన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా (10 AM TO 1 PM)	
పార్వతీపురం	8008566244
పాలకొండ	8008574299
సాలూరు	8008786820
కురుపాం	9849044696

? బందలుప్పి జడ్పీ ఉన్నత పాఠశాల ప్రహరీ ఆనుకొని రహదారిపై గుంత ఏర్పడింది. వాడుక నీరు నిలిచి మురుగుగా మారుతోంది. ఇబ్బందులు పడుతున్నాం. - గ్రామస్థులు

★ పరిశీలించి చర్యలు తీసుకుంటాం.
- రాజేంద్ర, ర.భ.శాఖ ఏఈ
- న్యూస్‌టుడే, పార్వతీపురం గ్రామీణం

? పాలకొండ రామకళామందిర్ వీధి రహదారిపై చెత్తకుప్పలు గుట్టలుగా పడిఉన్నాయి.
- రమణమూర్తి

★ చెత్తకుప్పలు తొలగించి శుభ్రం చేయిస్తాం.
- ఎస్.సర్వేశ్వరరావు కమిషనరు
- న్యూస్‌టుడే, పాలకొండ గ్రామీణం

పంచాయతీ కార్యదర్శి సస్పెన్షన్

బలిజిపేట గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని అజ్జాడ పంచాయతీ కార్యదర్శి జగన్మోహన్‌రావును విధుల నుంచి తొలగిస్తున్నట్లు ఎంపీడీవో విజయలక్ష్మి తెలిపారు. విధులు సక్రమంగా నిర్వహించడం లేదన్న కారణంతో ఆయనను తొలగిస్తూ కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారన్నారు. సంబంధిత ప్రతులను సోమవారం కార్యదర్శికి అందజేశామన్నారు.

ఇక దర్జాగా బడికి

కొండ శిఖరాల్లో పాఠశాలలు

పార్వతీపురం, న్యూస్‌టుడే:

పీవీటీజీ తరగతులకు చెందిన గిరిజనుల వెనుకబాటుకు చదువు కూడా కారణమని కేంద్రం గుర్తించింది. దీంతో కొండ శిఖరాల్లోని గిరిజనుల చెంతకు చదువు చేర్చేలా ఆయా గ్రామాల్లో జనాభా ప్రాతిపదికన ఆశ్రమ పాఠశాలలు ఏర్పాటుకు నిర్ణయించారు. ప్రధానమంత్రి జన్‌మన్ యోజన పథకం కింద సీతంపేట ఐటీడీఏ పరిధిలో ప్రతిపాదనలు చేశారు. పార్వతీపురం ఐటీడీఏ పరిధిలో కసరత్తు ప్రారంభిస్తున్నారు.

సుమారు 600 మందికి చేరువ..

పార్వతీపురం ఐటీడీఏ పరిధిలో 437 అత్యంత వెనుకబడిన గిరిజన తెగలు (పీవీటీజీలు) నివసిస్తున్న గ్రామాలున్నాయి. వీటిలో 281 గ్రామాల్లో ప్రాథమిక పాఠశాలలు ఉండగా, మరో 156 గ్రామాల్లో బడులు లేవు. ఒక్కో గ్రామంలో నలుగురైదుగురు చొప్పున లెక్కపెట్టినా సుమారు 600 మంది వరకు బడులకు దూరంగా ఉన్నారు. వీరందరినీ బడికి చేర్చాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.

ఒక్కో భవనానికి రూ.2.5 కోట్లు..

చిన్నారులకు ఇబ్బందులు తలెత్తకుండా 50 మందికి విద్య అందించేలా సమీప ప్రాంతాల్లో వసతిగృహాలు ఏర్పాటు చేయనున్నారు. ఒక్కో భవనానికి రూ.2.5 కోట్లు వెచ్చించే వీలుంది. ఇంటికి సమీపంలో ఉండటంతో పిల్లలను పంపించేందుకు తల్లిదండ్రులు సైతం ఆసక్తి చూపే అవకాశం ఉంది.



గుమ్మలక్ష్మీపురం మండలంలోని సవర తెగ గిరిజనులు నివసించే చింతమానుగూడ గ్రామం

సీతంపేటలో 6, భామినిలో 1..

సీతంపేట ఐటీడీఏ పరిధిలోని 6 కేంద్రాల్లో వసతిగృహాల నిర్మాణానికి అధికారులు ప్రతిపాదించారు. దీనిలో భాగంగా జిల్లా పరిధిలో సీతంపేట మండలంలో 3, భామినిలో 1 నిర్మించనున్నారు. మిగిలిన రెండు శ్రీకాకుళం జిల్లాలో ఉన్నాయి. సీతంపేట మండలానికి సంబంధించి గుడ్డిమీదగూడ, కర్రిమానుగూడ, పొంగళిగూడలో ఏర్పాటుకు ప్రతిపాదించారు. పార్వతీపురంలోని గ్రామాల గుర్తింపునకు ఇంజినీరింగ్, సంక్షేమ అధికారులతో పార్వతీపురం ఐటీడీఏ పీవో అశుతోష్ శ్రీవాస్తవ సమావేశమయ్యారు. సంక్షేమ అధికారులు తమ పరిధిలోని గ్రామాలను గుర్తించాలన్నారు.

సీతంపేటలో ఎంపిక పూర్తి

సీతంపేటలో పీవీటీజీ గ్రామాల్లో వసతిగృహాల ఏర్పాటుకు ఎంపిక పూర్తయింది. ప్రతిపాదనలు కూడా పంపించామని సీతంపేట గిరిజన సంక్షేమ ఈఈ సింహాచలం తెలిపారు. పార్వతీపురంలో ప్రక్రియ ప్రారంభమైందని ఈఈ కుమార్ తెలియజేశారు.

వరద బాధితులకు సాయం



చెక్కు అందిస్తున్న విశ్వబ్రాహ్మణ సంఘం సభ్యులు

గరుగుబిల్లి, న్యూస్‌టుడే: జిల్లా విశ్వబ్రాహ్మణ సంఘం తరపున విజయవాడ వరద బాధితులకు రూ.25 వేలు విరాళం అందజేసినట్లు గరుగుబిల్లి మండల సంఘాధ్యక్షుడు బి.బ్రహ్మాజీ, సీహెచ్.తవిటాచారి తెలిపారు. ఏపీ రాష్ట్ర సంఘం అధ్యక్షుడు పి.హనుమంతరావుకు నగదు ఇచ్చామన్నారు. కార్యక్రమంలో కె.గౌరీశంకరరావు, బాబూరావు పాల్గొన్నారు. ★ పార్వతీపురం గ్రామీణం: విజయవాడ వరద బాధితులకు అందరూ సాయం అందించాలని ఎమ్మెల్యే బి.విజయచంద్ర కోరారు. సూడిగాం మండల తెదేపా కార్యదర్శి చంద్రమౌళి, ప్రతినిధులు రూ.11 వేలు నగదు ఎమ్మెల్యేకు అందజేశారు.

మొక్కజొన్న పంట పరిశీలన



రైతులతో మాట్లాడుతున్న అధికారులు

మక్కువ, న్యూస్‌టుడే: మక్కువ మండలం నంద గ్రామంలోని మొక్కజొన్న పంటను జిల్లా వ్యవసాయాధికారి కె.రాబర్ట్‌పాల్, కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త ప్రసాద్ పరిశీలించారు. గిరిజన రైతులతో మాట్లాడి నష్టపోయిన వివరాలు సేకరించారు. విత్తనాలు విక్రయించిన కంపెనీ ప్రతినిధులు, డీలర్ల నుంచి వివరాలు సేకరించారు. సెప్టెంబరు 29న 'ఈనాడు'లో 'నకిలీలు అంట కట్టి..నట్టేట ముంచి..' శీర్షికన ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. ఏడీఏ ఎం.మధుసూదనరావు, ఏవో బి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారం కోరుతూ నిరసన

పాలకొండ, న్యూస్‌టుడే: ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని ఎన్ఎంయూ జిల్లా అధ్యక్షుడు కె.శంకరరావు డిమాండ్ చేశారు. పాలకొండలో నిరసన చేపట్టారు. డిపో ప్రబంధకుడే ఏకపక్ష వైఖరి విడనాడాలని కోరారు. గ్యారేజ్‌లో విడిభాగాల కొరత, బస్సుల నిర్వహణ అధ్వానంగా ఉండటంతో ప్రయాణికులు, ఉద్యోగులు ఇబ్బందులు పడుతున్నట్లు చెప్పారు. ఉపాధ్యక్షుడు పీవీరావు, డిపో అధ్యక్ష, కార్యదర్శులు సుబ్బారావు, రాజేష్, ఎం.వైకుంఠం, ఎన్బీరావు తదితరులు పాల్గొన్నారు.



నినాదాలు చేస్తున్న నాయకులు

లష్కర్ల పోస్టుల భర్తీకి వినతి



మంత్రికి వినతిపత్రం ఇస్తున్న గౌరునాయుడు

వీరఘట్టం, న్యూస్‌టుడే: కొన్నాళ్లుగా ఖాళీగా ఉన్న లష్కర్ల పోస్టులు భర్తీ చేయాలని వర్క్‌చార్జ్‌డ్ ఉద్యోగుల సంఘం ప్రతినిధులు మంత్రి రామానాయుడును కోరారు. విజయవాడలోని ఆయన నివాసములో మంగళవారం కలిసి వినతిపత్రం ఇచ్చారు. లష్కర్ల కొరతతో సాగునీటి నిర్వహణ సాధ్యం కావడం లేదన్నారు. శివారు ప్రాంతాలకు నీటి సరఫరా కష్టసాధ్యంగా మారిందన్నారు. రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.కలందర్, వి.గౌరునాయుడు, గౌరవాధ్యక్షుడు డి.జి.ప్రసాదరావు, మురళీమోహన్ ఉన్నారు.

పంటలకు విలువ జోడిస్తే ఫలితాలు

సీతంపేట, న్యూస్‌టుడే: గిరిజనుల పంటలను విలువ ఆధారిత వస్తువులుగా తీర్చిదిద్దితే మంచి ఫలితాలు వస్తాయని ఐటీడీఏ ప్రాజెక్టు ఉద్యాన అధికారి ఎస్.వి.గణేష్ అన్నారు. దిగువ కలువరాయిలో వెలుగు సంఘం ఆధ్వర్యంలో సేంద్రియ పద్ధతులపై అవగాహన కల్పించారు. మామిడి, జీడి, అనాస, కొండచీపుర్లు, చిరుధాన్యాల సాగు, ఇతరత్రా అంశాలను కేవీకే ప్రతినిధులు తెలియజేశారు. వెలుగు అసోసియేషన్ డైరెక్టర్ బి.సంజీవరావు, హెచ్‌వో పి.జయశ్రీ, కేవీకే శాస్త్రవేత్త హరికుమార్ పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న అధికారులు

ఆర్టీసీ బస్సులు ప్రారంభం



బస్సు ప్రారంభిస్తున్న జయకృష్ణ

పాలకొండ, న్యూస్‌టుడే: పాలకొండ ఆర్టీసీ డిపో రెండు బస్సులను ఎమ్మెల్యే జయకృష్ణ మంగళవారం ప్రారంభించారు. పాలకొండ-విజయవాడ, రాజాం- బలిజపేట మధ్య బస్సులు నడుస్తాయని డీపీటీవో శ్రీనివాసరావు, డీఎం పి.వెంకటేశ్వరరావు ఎమ్మెల్యేకు వివరించారు. ఆర్టీసీ అధికారులు, యూనియన్ నాయకులు లక్ష్మణరావు, బీకేమూర్తి, రాజు, వెంకటరమణ, రాజేష్, విజయబాబు, సుబ్బారావు, విద్యాసాగర్, కూటమి నాయకులు కె.అప్పలనాయుడు, గండి రామినాయుడు, సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

గర్భిణుల ఆరోగ్యంపై శ్రద్ధ

సీతంపేట, న్యూస్‌టుడే: గర్భిణుల ఆరోగ్యంపై ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని డీఎంహెచ్‌వో కె.విజయపార్వతి అన్నారు. హడ్డుబంగి ఆరోగ్య ఉపకేంద్రాన్ని సందర్శించారు. ఆశాలు సక్రమంగా విధులు నిర్వర్తించాలన్నారు. మర్రిపాడు పీహెచ్‌సీని సందర్శించారు. ఆసుపత్రిలో సిబ్బంది అందుబాటులో ఉండాలన్నారు. వైద్యులు సాయిచరణ్, సత్యవేణి ఉన్నారు.

రహదారి పనులకు శంకుస్థాపన

కొమరాడ, న్యూస్‌టుడే: బలరాముడు ప్రతిష్ఠించిన గుంప సోమేశ్వర ఆలయాన్ని అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టినట్లు ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి పేర్కొన్నారు. కోటిపాం కాలనీ నుంచి గుంప ఆలయానికి రూ.1.25 కోట్లతో తారు రోడ్డు నిర్మాణ పనులు మంగళవారం ప్రారంభించారు. తెదేపా నాయకులు శేఖర్‌పాత్రుడు, డి.వి.నాయుడు, ఎన్.మధు, జి.సుదర్శనరావు, పి.వి.నాయుడు, కె.శివున్నాయుడు, బి.వేణు తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రతతో రోగాలు దూరం

గుమ్మలక్ష్మీపురం, న్యూస్‌టుడే: పరిశుభ్రతతో రోగాలకు దూరంగా ఉండొచ్చని ప్రజలకు అవగాహన కల్పించాలని వైద్యారోగ్య శాఖ జిల్లా ప్రోగ్రాం అధికారి టి.జగన్మోహనరావు సూచించారు. మండలంలోని దుడ్డుఖల్లు పీహెచ్‌సీ పరిధిలో మంగళవారం ఆశ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. వైద్యురాలు శైలజాస్వాతి, ఏఎంవో సూర్యనారాయణ, పర్యవేక్షకులు సత్యరాజ్, పెంటమ్మ ఉన్నారు.

పారదర్శకంగా దుకాణాల ఎంపిక

సీతానగరం, న్యూస్‌టుడే: నూతన మద్యం పాలసీలో భాగంగా దుకాణాల కేటాయింపు పారదర్శకంగా నిర్వహిస్తామని అబ్కారీ శాఖ జిల్లా ఉప కమిషనర్ ఎస్‌వీవీఎన్.బాబ్జీరావు తెలిపారు. మంగళవారం సీతానగరం ఎక్సైజ్ కార్యాలయాన్ని సందర్శించారు. ఉమ్మడి జిల్లాలో 205 దుకాణాలకు 3,214 మంది ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో దరఖాస్తులు చేశారన్నారు. సీఐ పద్మావతి, సిబ్బంది ఉన్నారు.

చినబొండపల్లిలో పోలీసు పికెట్

పార్వతీపురం గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని చినబొండపల్లిలో పోలీసు పికెట్ నిర్వహించారు. సోమవారం రాత్రి జరిగిన వివాహ వేడుకలో రెండు వర్గాలకు చెందిన వారు రాళ్లు రువ్వుకున్నారు. ఈ నేపథ్యంలో మంగళవారం సర్పంచి శంకరరావు, తెదేపా మండలాధ్యక్షుడు చంద్రమౌళి, గ్రామ పెద్దలతో పోలీసులు చర్చించారు. అలర్లు జరగకుండా గ్రామీణ ఎస్సై దినకర్ నేతృత్వంలో సీఆర్పీఎఫ్ పోలీసులు కవాతు నిర్వహించారు.

కరుణించమ్మా.. దుర్గమ్మా



అజ్జాడలో కరెన్సీ నోట్లతో దుర్గమ్మ



అలంకరణలో గారమ్మతల్లి

న్యూస్‌టుడే, బృందం: దసరా నవరాత్రి ఉత్సవాలు జిల్లా వ్యాప్తంగా ఘనంగా జరుగుతున్నాయి. మంగళవారం అమ్మవారం వివిధ రూపాల్లో భక్తులకు దర్శనమిచ్చారు. కురుపాం మండలం రావాడ కూడలిలో మహాలక్ష్మి రూపంలో, బలిజిపేట మండలంలోని అజ్జాడలో కరెన్సీ నోట్ల అలంకరణలో దర్శనమిచ్చారు. శంబర పోలమాంబ ఆలయంలో హోమాలు నిర్వహించారు. సాలూరు మండలంలోని మామిడిపల్లిలో భక్తులు పాలకావిళ్లు మోశారు. పాలకొండలో కోటదుర్గమ్మ ఆలయానికి మహిళలు ఘటాలతో ఊరేగింపుగా వెళ్లి మొక్కులు చెల్లించుకున్నారు. అన్నవరం ఉమారామలింగేశ్వరస్వామి ఆలయంలో 108 కిలోల కుంకుమతో ప్రత్యేక పూజలు చేశారు.



పాలకావిళ్లను మోస్తున్న భవానీ భక్తులు



పాలకొండ కోటదుర్గమ్మ ఉత్సవాల్లో భాగంగా ఆకట్టుకున్న విశేష వేషధారణలు



దీపాలంకరణలో సాలూరు కామాక్షి

ఆర్థిక సాయం

బలిజిపేట గ్రామీణం: తుమరాడకు చెందిన ఎన్.సూరప్పడు కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఆయనకు జనసేన నాయకులు రూ.2000 నగదు, 25 కిలోల బియ్యం, నెలకు సరిపడా నిత్యావసరాలు అందజేశారు. నాయకులు ఎన్.తాతబాబు, ఎం.సురేష్, వి.సాయిరాం, పి.జయరాం, వై.అప్పలనాయుడు తదితరులున్నారు.

ఉప సర్పంచులకు శిక్షణ

బలిజిపేట గ్రామీణం: మండలంలోని 24 పంచాయతీల ఉప సర్పంచులు, ఇద్దరు చొప్పున వార్డు సభ్యులకు 9, 10 తేదీల్లో శిక్షణ ఇస్తున్నట్లు ఎంపీడీవో విజయలక్ష్మి తెలిపారు. పరిపాలన విధానం, ఏపీపీఆర్ చట్టం 1994 నిబంధనలపై వివరిస్తామన్నారు.

చెక్‌పోస్టుల ఆకస్మిక తనిఖీ

పాచిపెంట: మండలంలోని పి.కోనవలస చెక్‌పోస్టును విజిలెన్స్ ఎస్పీ బి.ప్రసాదరావు మంగళవారం రాత్రి ఆకస్మిక తనిఖీ చేశారు. అంతర్రాష్ట్ర వాహనాల మధ్య రాకపోకలు సాగిస్తున్న వాహనాల పత్రాలు పరిశీలించారు. అక్రమ రవాణా అరికట్టి, ప్రభుత్వ ఆదాయానికి గండి పడకుండా చూడాలన్నారు.

పంటకోత ప్రయోగం

సీతానగరం: ఖరీఫ్‌లో సాగు చేస్తున్న పంటల దిగుబడి లెక్కింపునకు నిర్వహించే పంట కోత ప్రయోగాలపై వ్యవసాయ, రెవెన్యూ సిబ్బందికి మంగళవారం శిక్షణ ఇచ్చారు. ఏవో అవినాష్, ఏఎస్‌వో సతీష్ అవగాహన కల్పించారు. గ్రామాల్లో సక్రమంగా ప్రయోగాలు చేయాలన్నారు.

వేగవంతం చేయాలి

సీతంపేట: ఐటీడీఏ పరిధిలో గోకులాల నిర్మాణాలు వేగవంతం చేయాలని పీవో యశ్వంత్‌కుమార్ రెడ్డి సూచించారు. గుమ్మడ, పులిపుట్టి, పెద్దబగ్గ, బొండిలో షెడ్డులను పరిశీలించారు.

కార్యదర్శులకు సూచనలు

సాలూరు గ్రామీణం: ప్రజారోగ్యంపై మరింత శ్రద్ధ చూపాలని ఇన్‌ఛార్జి పుర కమిషనర్ సి.హెచ్.సత్యనారాయణ అన్నారు. మంగళవారం పురపాలక సంఘ పరిధిలోని ఆరోగ్య కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. వార్డు పరిధిలో ఎక్కడైనా జ్వరాలు, అనారోగ్య పరిస్థితులు ఉంటే మెరుగైన చికిత్స కోసం ఆసుపత్రికి తీసుకెళ్లాలని సూచించారు.

విద్యార్థుల అపూర్వ కలయిక

సాలూరు గ్రామీణం, న్యూస్‌టుడే: సాలూరులోని వేద సమాజం సంస్కృతి ఉన్నత, పలు పాఠశాలల్లో 1990-91లో పదో తరగతి చదివిన విద్యార్థులు మంగళవారం ఆత్మీయ కలయిక నిర్వహించారు. పట్టణంలోని ఓ కల్యాణ మండపంలో జరిగిన కార్యక్రమంలో వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన వారంతా కలుసుకొని చిన్ననాటి జ్ఞాపకాలు గుర్తు చేసుకున్నారు. అప్పటి ఉపాధ్యాయులను ముఖ్య అతిథులుగా పిలిచి సన్మానించారు.



సూరంపేటలో కరిరాజులు

సీతానగరం, న్యూస్‌టుడే: మండలంలోని పలు గ్రామాల్లో ఏనుగుల సంచారంతో గ్రామీణ ప్రజలు ఆందోళన చెందుతున్నారు. మంగళవారం సూరంపేట రెవెన్యూలోని మామిడి తోటలో తిష్ఠ వేశాయి. కొన్ని చోట్ల పొట్ట దశలో ఉన్న వరి పైరును తొక్కేయడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

తనిఖీల వివరణ కోరుతూ ఉత్తర్వులు

పార్వతీపురం పురపాలక, న్యూస్‌టుడే: పార్వతీపురం పురపాలికలో కొందరు అవినీతికి పాల్పడుతున్నారని, సక్రమంగా పని చేయడం లేదని గతంలో పలువురు అనిశాకు ఫిర్యాదు చేశారు. 2021 డిసెంబరులో అనిశా అధికారులు ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. అప్పటి కమిషనరు పి.సింహాచలం, ఇద్దరు ఉద్యోగుల నుంచి వివరణ కోరారు. సంబంధిత విషయాన్ని అనిశా ప్రభుత్వానికి తెలియజేసింది. ఈ నేపథ్యంలో ఇక్కడ గతంలో జరిగిన తనిఖీల పూర్తి వివరాలను తెలియజేయాలని పురపాలక ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఉత్తర్వులు విడుదల చేశారు.

ఇసుక వాహనాల స్వాధీనం

పాలకొండ, న్యూస్‌టుడే: మండలంలోని చినమంగళాపురం సమీపంలో నాగావళి నుంచి ఇసుక అక్రమంగా తరలిస్తున్న నాలుగు లారీలను పట్టుకున్నట్లు ఎస్సై ప్రయోగమూర్తి తెలిపారు. మంగళవారం వేకువజామున తమకు అందిన సమాచారం మేరకు తనిఖీలు చేపట్టామన్నారు. అక్రమ రవాణాకు వినియోగిస్తున్న రెండు పొక్లెయిన్లు సైతం స్వాధీనం చేసుకొని పలువురిపై కేసులు నమోదు చేసినట్లు చెప్పారు. ఇసుక అక్రమ రవాణాకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

జాతీయ పోటీలకు ఎంపిక



భామిని, న్యూస్‌టుడే: భామిని ఆదర్శ పాఠశాల విద్యార్థిని రీబికా జాతీయ పోటీలకు ఎంపికయ్యిందని ప్రిన్సిపల్ రఘుపాత్రుని శివకుమార్ తెలిపారు. శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్లలో జరిగిన అండర్-19 కబడ్డీల్లో ఆమె రాష్ట్రస్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబర్చారు. పీడీ శివరాం ప్రసాద్, ఉపాధ్యాయులు ఆమెను అభినందించారు.

సస్యరక్షణతో దిగుబడులు



అవగాహన కల్పిస్తున్న ఏడీఏ నిర్మలజ్యోతి

గుమ్మలక్ష్మీపురం, సీతంపేట, కురుపాం గ్రామీణం, పార్వతీపురం గ్రామీణం, న్యూస్‌టుడే: పంటల సాగులో సరైన సస్యరక్షణ చర్యలు పాటిస్తే ఆశించిన దిగుబడులు పొందవచ్చని ఏడీఏ నిర్మలజ్యోతి పేర్కొన్నారు. తాడికొండ, పెదఖర్జలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. పత్తి, వరిలో ఎరువులు, నీటి యాజమాన్యం గురించి వివరించారు. ఏవో ప్రసాద్, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది గణేష్, శరత్‌చంద్ర, నవీన్, శివ ఉన్నారు. ★ సీతంపేట మండలంలోని తుంబకొండ, మానాపురంలో ఏవో పి.శ్రీదేవి, శాస్త్రవేత్త ఎన్.లక్ష్మీనారాయణ, కురుపాం మండలం పెదగొత్తిలిలో వ్యవసాయ అధికారులు, పార్వతీపురంలో జిల్లా రిసోర్సు కేంద్రం ఏడీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించారు. దోమ తెగులు నివారణ చర్యలపై అవగాహన కల్పించారు.